తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## సాదాసీదా భక్తుడుగా కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్,జనవరి 22 ప్రభాతవార్త
తిరుపతిజిల్లా కలెక్టర్ ఓ సామాన్య భక్తుడుగా తన కుటుంబంతో కలసి శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తొండమనాడులో చారిత్రత్మక ప్రసిద్ధిచెందిన వెంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇటీవల కాలంలో ఈ ఆలయాన్ని టిటిడి బాగా అభివృద్ధి పరచింది. దాంతో శ్రీకాళహస్తికి వచ్చే భక్తులు హెచ్చు శాతం మంది ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి రాగా ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు.

## పోలీసు రాత పరీక్షలు ప్రశాంతం

- పరీక్షలకు 942 మంది అభ్యర్థులు గైర్హాజరు
- పరీక్షల తీరును పరిశీలించిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి



చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో పోలీసు రాత పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి.

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:
జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. చిత్తూరు నగర పరిధిలో 33 పరీక్షా కేంద్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షలను నిర్వహించగా ఈ పరీక్షలకు 942 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఆదివారం జరగాల్సిన పరీక్షలకు 12,196 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 11,254 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పురుష అభ్యర్థులకు సంబంధించి 9,719 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 9,026 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మహిళ అభ్యర్థులకు సంబంధించి 2,477 మంది హాజరు కావాల్సివుండగా 2,228 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పురుషులకు సంబంధించి 693 మంది, మహిళలకు సంబంధించి 249 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. చిత్తూరు నగరంలో పివికెఎన్ డిగ్రీ కళాశాల, విజయం డిగ్రీ కళాశాలల్లో జరిగిన పోలీసు రాత పరీక్షలను ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలిం పరీక్షల విధులకు హాజరైన ఇన్విజిలేటర్లు, అభ్యర్థులకు పలు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల సిట్టింగ్ సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలపై సమీక్షించి పరీక్షల్లో కాపీయింగ్, ఇతర అక్రమాలు జరుగకుండా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీ రిశాంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో 33 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రాథమిక రాత పరీక్ష జరుగుతుందని, ఇందుకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక ఎస్ఐ, సిబ్బందితో పాటు బిడి టీమ్‌తో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో వున్న జెరాక్స్ కేంద్రాలను మూసి వేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు పోలీసు రాత పరీక్షలు పూర్తి కాగా పరీక్షా కేంద్రాల నుండి పోలీసు సిబ్బంది భారీ బందోబస్తుతో పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసి స్ట్రాంగ్ రూమ్‌కు జవాబు పత్రాలను తరలించారు.

# 'యువగళం'కు మేము సైతం...

### జిల్లా ముఖ్యనేతలపై బాధ్యతలు !
### -పులివర్తి, అమర్, గౌనివారి, మనోహర్, దొరబాబు ఏర్పాట్లులో నిమగ్నం



ప్రభాతవార్త-తిరుపతి:
సహజంగానే సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల సమస్యలు కళ్ళారా చూస్తూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రజలకు మరీ దగ్గర కావడానికి రాజకీయపార్టీల నేతలు పాదయాత్రలు చేపట్టడం ఆనవాయితీగా మారింది. ఇదే తరహాలోనే 2024 ఎన్నికలకు సిద్ధమవడానికి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సమాయత్తమవుతోంది. రాష్ట్రంలో అధికార వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలు తెలుసుకునేందుకు స్వయంగా తెలుగుదేశం జాతీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ, యువనేత నారాలోకేష్ 27వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా "యువగళం" పేరుతో చేపట్టనున్న పాదయాత్రకు చిత్తూరుజిల్లా పార్టీ నేతలు కుప్పంలో ఏర్పాట్లపై తలమునకలవుతున్నారు. కుప్పంలో తొలుత పాదయాత్ర లోకేష్ ప్రారంభించనుండటంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో చిత్తూరుపార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు,చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని, మాజీమంత్రి అమరనాథరెడ్డి, సీనియర్ నాయకులు దొరబాబు,గౌనివారి శ్రీనివాసులు, సురేంద్రకుమార్,పిఎస్ మునిరత్నం, చంద్రబాబు పిఎస్ మనోహర్, తిరుపతి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ తోబాటు కుప్పం, పలమనేరు స్థానిక నాయకులు కూడా యువగళం ప్రారంభం విజయవంతం చేయడానికి తమ భుజాలపై బాధ్యతలు వేసుకుని స్వయంగా నిమగ్నమై పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే యువగళం పాదయాత్రపై టిడిపి అధిష్టానం కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. టిడిపి అధినేత,మాజీ సిఎం కుప్పం సిట్టింగ్ ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో పాదయాత్ర సభను జయప్రదం చేసి 2024 ఎన్నికలకు సమరశంఖం పూరించాలని నాయకులు భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, సమావేశాల నిర్వహణ, పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా యువనేతతో కలసి నాయకులు అడుగులేసేందుకు సిద్ధమయ్యారు. యువగళం పాదయాత్రలో పాల్గొనేందుకు ఉమ్మడి చిత్తూరుజిల్లాకు విచ్చేస్తున్న నారాలోకేష్ 25వతేదీ బుధవారం తిరుమలకు విచ్చేస్తున్నారు. రాత్రికి తిరుమలలోనే బసచేయనున్న ఆయన 26వతేదీ ఉదయం ఇష్టదైవమ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ఆశీస్సులందుకోనున్నారు. 27వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరుతో చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే శక్తిని ప్రసాదించాలని వేడుకోవడానికి తిరుమలకు వస్తున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఈ సందర్భంగా తిరుమల,తిరుపతిలో టిడిపి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. 27వతేదీ నుంచి 4వేల కిలోమీటర్లు చేపట్టనున్న పాదయాత్రలో తెలుగుదేశం శ్రేణులు కూడా అడుగేలేయనున్నారు. తొలిరోజు 27వతేదీ 8.3కిలోమీటర్లు లోకేష్ నడవనున్నారు. రెండవరోజు, మూడవరోజు కూడా కుప్పం నియోజకవర్గంలోనే ఆయన పాదయాత్ర సాగనుంది. మూడురోజులు సుమారు 29కిలోమీటర్లు నడవనున్నారు. గతంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో అప్పట్లో ఎన్నికలకు ముందు అప్పటి కాంగ్రెస్ నేత ,దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1,468కిలోమీటర్లు ప్రజాప్రస్థానం పేరుతో చేపట్టగా, ఆ తరువాత వస్తున్నా మీకోసం పేరుతో టిడిపి అధినేత నారాచంద్రబాబునాయుడు 2,340కిలోమీటర్లు పాదయాత్ర, వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 3వేల కిలోమీటర్లు ప్రజాసంకల్పయాత్ర పేరుతో పాదయాత్రలు చేశారు.

## గ్రామ సచివాలయాలు ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



బంగారుపాళ్యం, జనవరి 22 ప్రభాతవార్త:
మండల కేంద్రం బంగారుపాళ్యంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ఆదివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. బంగారుపాళ్యం-1 సచివాలయంకు ప్రభుత్వం 40 లక్షల రూపాయలు, బంగారుపాళ్యం-2 గ్రామ సచివాలయం 40 లక్షల రూపాయలు మంజూరు చేసింది. అలాగే రైతు భరోసా కేంద్రంకు 21.40 లక్షల రూపాయలతో నిర్మించిన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణుల చెంతకే ప్రజా పాలన అందించాలనే లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సచివాలయాల్లో ప్రజలకు అన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులో వుంచిందన్నారు. అలాగే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తోందన్నారు. అనంతరం బంగారుపాళ్యం జామియా మసీదును మంత్రి సందర్శించారు. షాదీమహల్ నిర్మాణానికి రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి సహకారంతో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప 50 లక్షల రూపాయలు మంజూరు చేశారని మంత్రి దృష్టికి మైనార్టీ నాయకులు తీసుకువచ్చారు. ఈ నిధులతో పనులు చేపట్టాలని అవసరం అయితే తాను నిధులు మంజూరు చేస్తానని మంత్రి పేర్కొన్నారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న జామియా మసీదుకు గ్రానైట్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జడ్పీటిసీ సోమశేఖర్, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారే సోమశేఖర్, వైస్ ఛైర్మన్ సర్దార్, బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, ఎంపిటిసీ ఉషారాణి, పలువురు వార్డు సభ్యులు, వైకాపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ భూస్థాపితం తథ్యం

### - మంత్రి రోజా



టీడీపీ నుంచి వైసీపీ పార్టీలో చేరిన వారితో మంత్రి రోజా

నగరి, జనవరి 22 ప్రభాతవార్త:
మండలంలోని మేళపట్టు గ్రామానికి చెందిన టీడీపీ మద్దతు సర్పంచ్ దేవి, ఆమె అనుచరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం నగరి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన వారిని మంత్రి రోజా పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి ఎంతో మంది ముఖ్యమంత్రులు ఉండి వెళ్లారని ఎవరూ చేయని అభివృద్ధి, సంక్షేమం జగనన్న మాత్రమే చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందుకే నేడు టీడీపీకి చెందిన వారు కూడా జగనన్నకు అండగా నిలవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. టీడీపీ భూ స్థాపితం కావడం ఖాయమన్నారు. మరో 30 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారన్నది ఎవరూ మార్చలేనిదన్నారు. టీడీపీ వారు ఏం చేయలేరని ప్రజలకే నేడు అర్థమైందన్నారు. నగరిలో తనకు పోటీగా నిలిచి ఓడిన వ్యక్తి ఇదేం కర్మ అంటూ ఊళ్ళపైకి వస్తున్నారన్నారు. ఓడించి పంపినా మళ్లీ రాజకీయ లబ్ధికి ఊళ్ళపైకి వచ్చే అతన్ని చూసి జనం ఇదేం కర్మ రామాకు అని ఛీదరించుకుంటున్నారన్నారు. ఏ రోజైనా సొంత డబ్బుతో ఆయన ఏవైనా చేశారా అని ప్రశ్నించారు. కొత్తగా వచ్చిన వారు ఇది వరలో పార్టీలో ఉన్న వారు ఎలాంటి భేషజాలకు పోకుండా కలసి మెలసి ఉండాలని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పార్టీలో చేరిన సర్పంచ్ దేవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పార్టీలు చూడకుండా పారదర్శకంగా ప్రతి సంక్షేమం అమలు చేస్తోందన్నారు. మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంతో మందిని ఆదుకుంటున్నారన్నారు. వైసీపీ పార్టీలో సర్పంచ్‌తో పాటు నాయకులు ప్రకాష్, గోవిందన్, మునిరత్నం, శంకర్, ఎస్.దేశన్, గోపి, దేశయ్య, సురేష్ వీరితో పాటు వంద మంది టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నయ్యప్ప, ఆర్‌బీకే ఛైర్మన్ బుజ్జిరెడ్డి, పార్టీ నాయకులు సుదర్శనంనాయుడు, హేమాద్రి, శ్రీనివాసులురెడ్డి, నాగరత్నం, రామూర్తి, జైలా, గోపి, వెంకటేష్, బాలాజీ, బాబు, అరుల్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు అలసిపోవద్దు

### నాయకులు,కార్యకర్తలకు మాజీ మంత్రి అమర్ పిలుపు

గంగవరం, జనవరి 22, ప్రభాతవార్త :



రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అలసిపోవద్దు అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడు పిలుపు మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం మండలంలోని కీలపల్లె పంచాయతీ జేఆర్ కొత్తపల్లె గ్రామంలో స్థానిక నాయకుల ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను, అవినీతి, ఆగడాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పరిపాలన రౌడీ రాజ్య పాలనగా జులుం చెలాస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విడతల వారిగా మద్యనిషేదం చేస్తామన్న పెద్దమనిషి నేడు నిషాంధ్రప్రదేశ్‌గా మార్చాడని ఎద్దేవా చేశారు. ఈ సైకో పాలన నుంచి విముక్తి పొందాలంటే ప్రతి ఒక్కరూ టిడిపిని అధికారంలోనికి తీసుకురావడానికి రాజీలేని పోరాటం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధానకార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు గంగవరం, నారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.చినబ్బ, గవిమఠం లోకేష్, కె.నాగరాజగౌడు, నాగరాజరెడ్డి, వెంకటేష్‌నాయుడు, బత్తిగౌడు, రెడ్డిశేఖర్, మల్లిఖార్జున గౌడు, రంగారెడ్డి, కొత్తపల్లె మోహన్‌రెడి, రామ్మోహన్‌నాయుడు, బాలాజీ, హరి, దేవేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రెడ్డెప్ప, వెంటేష్, శంకర తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పైభాగంలో డ్రోన్‌కెమెరా చిత్రీకరణ!

### -ఆస్థానమండపం సమీపంనుంచే ప్రయోగం
### తప్పిదంపై వేటు ఎవరిపైనో!?

తిరుమల,జనవరి 22 ప్రభాతవార్తప్రతినిధి:
అత్యంత భద్రత నడుమ ...నిరంతరం సిసికెమెరాల పర్యవేక్షణలో ఉండే కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వర ఆలయాన్ని డ్రోన్‌కెమెరాతో చిత్రీకరించిన ఘటనపై టిటిడి అధికారులు ఓ నిర్ధారణకు వచ్చారు. డ్రోన్‌తోనే ఆలయాన్ని చిత్రీకరించారని, ఈ తప్పిదం గతంలో టిటిడి తెప్పించుకున్న డ్రోన్ ఆపరేటర్ నిర్వాకంతోనే జరిగిందని స్పష్టతకు వచ్చారు. అయితే ఆపరేటర్ తనకు నిర్ధేశించిన కాకులకొండ సమీపంలోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాంతాన్ని చిత్రీకరించడంతోబాటు ఆలయం వద్దకు చేరుకుని ఆలయాన్ని చిత్రీకరించాడనే విజిలెన్స్‌వర్గాలు సమాచారం. అయితే అతను ఆలయం పరిసరాల్లో కూడా చిత్రీకరించాడా అనే కోణంలో విచారణ చేయనున్నారు. ఆస్థానమండపం ముందుభాగంలో ఖాళీస్థలం నుంచి గత ఏడాది అక్టోబర్‌గానీ నవంబర్‌లోగానీ డ్రోన్ చిత్రీకరణ జరిగిందని గుర్తించారు. మూడు నెలల క్రిందట ఆలయం ముందుభాగం, ఆలయాన్ని ఓ డ్రోన్ కెమెరా సాయంతో వీడియో చిత్రీకరించినా భద్రత సిబ్బంది కంటపడకపోవడం, గుర్తించి చర్యలు తీసుకోలేకపోవడం టిటిడి నిఘాభద్రత విభాగం సిబ్బంది పనితీరును వెక్కిరిస్తోంది. వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారమై హల్‌చల్ చేయడంతో వెంటనే మేలుకున్న నిఘా భద్రత విభాగం అధికారులు , ఈ వ్యవహారంపై ఎట్టకేలకు ఆదివారం సాయంత్రానికి నిర్థారణకు వచ్చారు. ఈ వీడియోలను ఎంతవరకు పంపారు ,ఎవరికైనా బయట వ్యక్తులకు అమ్మేశారా?దీనివల్ల ప్రమాదం ఉందా అనే కోణంలో కూడా లోతుగా విచారణ చేయనున్నారు. అయితే ఇంత జరిగినా సిసిటివిరికార్డింగ్ పుటేజీలను నిశితంగా తిరగేసినా ఇప్పటి వరకు కనుక్కోలేకపోవడం వెనుక ఈ పెద్ద నిర్లక్ష్యంలో ఎవరిపై వేటు పడుతుంది?ఎవరిని శిక్షిస్తారనేది వేచిచూడాల్సిందే

### ఉష్ణోగ్రతలు
22/1/2023



- తిరుపతి 29 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

### బంగారం ధరలు
22/1/2023



22 క్యారెట్స్
1గ్రాము
రూ. 5, 320

24క్యారెట్స్
1గ్రాము
రూ.5,804

### కోడిగ్రుడ్ల ధరలు
22/1/2023



కోడిగ్రుడ్డు
:రూ.6.00
1 డజను:
రూ.72.00

## ఐదురోజుల్లో మినీబ్రహ్మోత్సవం

### 28న సప్తవాహనసేవలు
### అన్ని ఆర్జితసేవలు ,విఐపి బ్రేక్ దర్శనాలురద్దు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
మాఘమాసంలో సప్తమి తిధిన 28వతేదీ శనివారం సూర్య జయంతి సందర్భంగా ఒకేరోజు ఏడువాహనాలపై మలయప్ప స్వామి ఊరేగనున్నారు. "మినీబ్రహ్మోత్సవం" (రథసప్తమి)న ఉదయం నుంచి రాత్రి వరకు వాహనసేవలు ఊరేగినా తొలి వాహనంగా సూర్యప్రభతో మొదలై చిన్నశేష,గరుడ, చక్రస్నానం, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలతో చివరగా రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయి. శని వారం రథసప్తమి రావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే వీలుంది. ఆలయ మాఢవీధుల్లో ఇప్పటికే గ్యాలరీలు ఏర్పాటు, భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం, అన్న ప్రసాదాలు, తాగునీరు. కాఫీ, పాలు,టీ నిరంతరాయంగా పంపిణీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. శ్రీదేవి భూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం సూర్యజయంతి ప్రత్యేకత. శనివారం ఆలయంలో అన్ని సేవలు రద్దుచేశారు. విఐపి బ్రేక్ దర్శనాలు కూడా రద్దయ్యాయి. పూర్తిగా సర్వదర్శనంలోనే భక్తులు మూలవిరాట్టును దర్శించుకోవాల్సి ఉంది.

# ఆలయ ఉభయదారులకు ఆంక్షలా?

### సామాన్య భక్తుల పేరుతో మాకు ఇబ్బందుల పెట్టొద్దు
### ఆలయ ఉభయదారుల ఏకగ్రీవ తీర్మానం



కాణిపాకం, జనవరి 22 ప్రభాతవార్త:
ఆలయ అభివృద్ధికి ఎన్నో ఏళ్ళుగా అహర్నిశలు కృషి చేసిన ఉభయదారులకు ఆలయంలో దర్శనాల విషయంగా ఆంక్షలు పెడతారా? సామాన్య భక్తులకు దర్శనాల పేరుతో ఉభయదారులకు ఇబ్బందులు పెట్టరాదంటూ ఉభయదారులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దేవస్థానం నందు స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు, ముఖ్య అతిథుల దర్శన ఏర్పాట్లు విషయమై స్థానిక మణికంఠేశ్వరాయంలో దేవస్థానం ఉభయదారుల సమావేశంను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ వెంకటేశు మాట్లాడుతూ ఆలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు నిరాటంకంగా దర్శనాలు కల్పించేందుకు వీలుగా కమీషనర్ పలు సూచనలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు విఐపీలకు, ఆలయ ఉభయదారులకు ప్రతిరోజూ ప్రత్యేకంగా టైం స్లాట్‌ను కేటాయించాలని. దర్శనాలకు వచ్చే విఐపీలు, ఉభయదారులకు సంబంధించి వారి కుటుంబసభ్యులు ఆరుగురుకు మించి వస్తే టిక్కెట్ కొనుగోలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు, దీనిపై ఉభయదారులు సలహాలు సూచనలు చేయాలని తెలిపారు. దీనితో ఉభయదారులు మాట్లాడుతూ ఎంతో చిన్న దేవాలయమైన కాణిపాకం ఆలయం ఉభయదారుల కష్టం, కృషి వల్లనే నేడు ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం ఉభయదారులు భూములు, ఆస్తులను అందజేశారని, లక్షలాది రూపాయలు ఖర్చుచేసి ప్రతిఏటా ఆలయంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉభయదారులకు స్వామివారి దర్శనం విషయమై ఆంక్షలు పెట్టడమేంటని ధ్వజమెత్తారు. బ్రిటీష్ కాలంనాటి జీఓల వలె ఆలయంలో కమీషనర్ ఆదేశించారని లేనిపోని చట్టాలు తెచ్చి ఆంక్షలు పెడతారా అంటూ ఈఓను నిలదీశారు. ఉభయదారుల పట్ల ఆలయంలో ఆంక్షలు విధించరాదని, ఆలయ దర్శనార్థం వచ్చే ఉభయదారులకు ఆలయంతో తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని తేల్చి చెప్పారు. అవసరమైతే ఉభయదారులందరూ జిల్లా మంత్రి వద్దకు వెళ్ళి ఉభయదారుల వ్యవస్త గురించి వివరిస్తామని స్పష్టం చేశారు.

**ఉభయదారుల హక్కులను కాపాడుతూ: ఛైర్మన్ మోహన్‌రెడ్డి**

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దేవస్థానంకు సంభందించి 14 గ్రామాల ఉభయదారుల హక్కులను కాపాడేందుకు తన వంతు కృసి చేస్తానని ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉభయదారుల సమావేశంలో ఆలయ మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రి, కమీషనర్ ఆదేశాల మేరకు ఉభయదారుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉభయదారులు సహకారంతోనే తాను ఛైర్మన్ అయ్యాయని, పాలకమండలి ఛైర్మన్‌గానే కాకుండా ఉభయదారుడిగా ఆలయంలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారులకు తగిన గౌరవ మర్యాదలు దక్కే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆలయంలో స్వామివారి దర్శనాల విషయంలో ఎటువంటి ఆంక్షలు విధించబోమని తేల్చిచెప్పారు. ఈసమావేశంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఆలయ ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, మాజీ ఛైర్మన్ జగన్నాధరెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌లతో పాటు ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

## పరిమిత వేగం పదిలం..అతివేగం ప్రమాదకరం

గంగవరం, జనవరి 22, ప్రభాతవార్త :

పరిమిత వేగం పదిలమని,అతివేగం ప్రమాదకరమని స్థానిక చెక్‌పోస్ట్ ఎంవిఐలు ఆంజనేయప్రసాద్, భూషన్‌రెడ్డిలు పేర్కొన్నారు.34వ జాతీయ రహదారి భద్రతవారోత్స వాల్లో భాగంగా ఆదివారం ఉదయం బెంగళూరు,చెన్నై జతీయ రహదారిపై లారీ,టెంపో,ఆటో డ్రైవర్లకు,ద్విచక్రవాహనదారులకు రహదారుల నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపి క్షేమంగా తమ గమ్యాన్ని చేరుకోవాలన్నారు.వాహనదారులు ప్రతి వ్యక్తి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని,వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటే మీ కుటుంబాలతో పాటు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు వీధిన పడేందుకు కారణమవుతున్న విషయాన్ని ప్రతిడ్రైవరు గుర్తించుకోవాలన్నారు.ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.ట్రాఫిక్ నియమాలను ఉస్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహక రించాలనికోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ దీపిక,రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదవ వెల్ఫేర్ జెఏసి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మణిగోపాల్ యాదవ్

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ యాదవ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా కుప్పంకు చెందిన మణి గోపాల్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతి నగరంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి యాదవ కులస్తులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 14శాతం ఉన్న యాదవ కులస్తులకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత లభించడం లేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 25 అసెంబ్లీ, 6 పార్లమెంట్ స్థానాలు యాదవులకు కేటాయించేలా తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్‌వైజెఏడబ్ల్యుఎస్ మీడియా అధ్యక్షుడు బాలాజీ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గాయత్రి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు యాదవ్, మంజుల, జయప్రకాష్ యాదవ్, బాలాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్‌చైర్మన్ మునస్వామి చొరవతో రోడ్డు సౌకర్యం

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీ కొత్తపేట ప్రాంతంలోని వికాస్ జూనియర్ కాలేజ్, ప్రజ్ఞ స్కూల్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న ప్రజలకు గతకొన్నేళ్లుగారోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో చిత్తూరుఎమ్మెల్సీ భరత్,మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌ల సూచనలతో ఆ ప్రాంతాల్లో నూతనంగా రోడ్ల నిర్మాణంకు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి చొరవ చూపారు. ఆ ప్రాంతాల్లోనూతనంగాసిసిరోడ్లుతోపాటుడ్రైనేజీలను నిర్మిస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 39మంది ఎంపిక

కుప్పంరూరల్, జనవరి 22 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రిచే ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది.సుమారు 180మంది శిబిరంలో పాల్గొనగా వారికి వైద్య పరీక్షలు జరిపి 39మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్ర మంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎస్ జగదీష్‌బాబు, వైద్య బృందం గిరీష్, మహదేవ్ పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, జనవరి 22 ప్రభాతవార్త



సిఎం జగనన్న పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా రని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షు డు భరత్ పేర్కొన్నారు. ఆదివారం మొరసనపల్లి పం చాయతీ పాకంపల్లి, నారసింహ పల్లి, జల్లి గానిపల్లి గ్రామాల్లో ఆయన గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగనన్న పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకునే నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నార న్నారు.కుప్పం అభివృద్ధికి సిఎం కట్టుబడి ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి త్వరలోనే వంద కోట్ల నిధులు మంజూరు కానున్నాయని తద్వారా గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి, సర్పంచ్ జగదీష్, మంజునాథరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసమే పథకాలు - ఎమ్మెల్యే ఆరణి

శ్రీనివాసులుగుడిపాల, జనవరి 22 ప్రభాతవార్త:



సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గుడిపాల మండలం చీలాపల్లి సచివాలయం మొగరాలపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. పథకాలకు అర్హులై వుండి ఎవరికైనా మంజూరు కాకుంటే అలాంటి వారు మళ్ళీ పథకాల కోసం దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వీటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ జనార్ధన్, సర్పంచ్ సోఫియా గ్లోరీ, రజనీకాంత్, సుధాకర్‌నాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్ చల్లముత్తు, ఎంపిటిసీ మొగిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు జడ్పీ ఛైర్మన్ పరామర్శ

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అమ్మమ్మ మృతి చెందడంతో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంట్లో ఆయనను పరామర్శించారు.ఈసందర్భంగాజడ్పీ ఛైర్మన్ పూతలపట్టు ఎమ్మెల్యే అమ్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## బోయకొండపై తరగని భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 22 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో అమ్మవారి కొండ భక్తజనసం ద్రమైంది. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు, వేదపండితులు వేకువ జామునే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. విశేష సంఖ్యలో వచ్చిన యాత్రీకులకు ఆయల ఛేర్మన్ మిద్దింటి శంకరానారాయణ, ఇఓ చంద్రమౌళి, అధికార, సిబ్బంది సేవలందించారు

## అమ్మవారి సేవలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 22 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలు దర్శించుకొన్నారు. వారిని ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళిలు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించడంతోపాటు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. దేవస్థాన పాలకమండలి సభ్యులు వెంకట్రమణారెడ్డి, పూర్ణిమారాయల్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## వివక్షతకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి : శివ

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వారిపై కులవివక్షత పాటించి, దారిని మూసేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేసారు. జిల్లాలోని బైరెడ్డిపల్లి మండలం అలపల్లిలో ఈనెల 21న అందరివాడు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించారనీ, అయితే వారిని గ్రామంలోకి రానివ్వకుండా ముళ్ళకంపలు రోడ్డుపై వేయడం దారుణమన్నారు. అలాంటి అగ్రవర్ణాల వ్యక్తులపై చట్టపరమైన శిక్షలు వేయాలనీ, లేకుంటే మాలమహానాడు ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ముకుంద, మణి, మధు, అశోక్, నాని, హరి, తదితరులు హాజరయ్యారు.

## మండల జెసిఎస్ కన్వీనర్‌గా ఆడెం రుక్మిణమ్మ

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

మండల జెసిఎస్(జగనన్న సచివాలయ కమిటీ) ఇన్‌ఛార్జీగా మాజీ ఎంపిపి ఆడెం రుక్మిణమ్మ నియమితులయ్యారు. ఆది నుంచి పెద్దిరెడ్డి కుటుంబానికి విధేయురాలుగా వున్న ఆడెం రుక్మిణమ్మ ఎంపిపి, జడ్పీటీసీగా మండలానికి సేవలందించారు. దీంతో అధిస్టానం జెసిఎస్ ఇన్‌ఛార్జీగా అవకాశమిచ్చింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సచివాలయాల కన్వీనర్ల నియామకం

సదుం,సోమల,కల్లూరు, జనవరి 22 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ల నియామకం జరిగిది. సదుం మండలానికి జోగివారిపల్లె పంచాయతీ మార్తువారిపల్లెకు చెందిన నాలి ప్రకాష్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా పులిచెర్ల మండలానికి మంగళంపేటకు చెందిన ముర్వత్‌భాషాను నియమించారు. సోమల మండలానికిదిడ్డివారిపల్లెకు చెందిన ఆర్.మంజునాద్ అలియాస్ మదును నియమించారు. ఈమేరకు వారికి జిల్లా పరిశీలకులు శివశంకర్, జిల్లా వైకాపా అధ్యక్షుడు ఎంఎల్‌సీ భరత్, పుంగనూరు నియోజక వర్గవైకాపా ఇన్‌చార్జి జింకా వెంకటాచలపతిలు నియామక ఆదేశాలు అందజేశారు. వారు మాట్లాడుతూ తమను నమ్మి తమకు బాధ్యతతో కూడిన జగనన్న సచివాలయాల కన్వీనర్ల బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిధున్‌రెడ్డికి, తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి, రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డికి,జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశించిన పనులను తాము నెరవేర్చి వైకాపా ను ప్రజల్లోకి తీసుకుపోయి మరింతగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## నేడు స్పందన

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై అర్జీలు తీసుకొని వస్తే అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటారన్నారు. అలాగే ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు సచివాలయ సిబ్బంది స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని అక్కడికి వెళ్ళి సైతం ప్రజలు సమస్యలపై అర్జీలు పెట్టుకొంటే పరిశీలించి పరిష్కరిస్తారన్నారు.

## చలమరాజుఇండ్లులో కరెంటు కష్టాలు

– రెండు రోజులుగా ఫీజు వేసే దిక్కులేక ఎండుతున్న పంటలు

పాలసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో రైతులకు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని వనదుర్గాపురం పంచాయతీ చలమరాజుఇండ్లు గ్రామ రైతులు గత నాలుగు రోజులుగా పంట పొలాలకు నీరు లేక ఇక్కట్లు పడుతున్నా ట్రాన్స్‌కో అధికారులు ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. రైతు పొలాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎబి స్విచ్‌లు లేకపోవడంతో రైతులు కరెంటు సరఫరా నిలుపుదల చేసి ఫ్యూజు వేసుకోని పరిస్థితి ఏర్పడింది. ఇది వరకు వున్న లైన్‌మేన్ బదిలీ కావడంతో ఈ సర్కిల్‌కు కొత్త లైన్‌మెన్ నియామకం జరుగలేదు. ప్రస్తుతం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఒక లైన్‌మెన్‌ను ఇక్కడికి ఇన్‌ఛార్జీగా నియమించడంతో అతను ఇక్కడి కరెంటు సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని వ్యవసాయ పంట పొలాలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

***సమస్య పరిష్కరించడానికి చర్యలు: డిఇఇ జ్ఞానశేఖర్*** వనదుర్గాపురం పంచాయతీ చలమరాజుఇండ్లులో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామని ట్రాన్స్‌కో డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్ఞానశేఖర్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ వారం రోజుల్లో వనదుర్గాపురం పంచాయతీ మొత్తం ఎబి స్విచ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామన్నారు. వనదుర్గాపురం లైన్‌మెన్ పోస్టు భర్తీకి త్వరలో చర్యలు తీసుకొంటామని ఆయన పేర్కొన్నారు.

## పొంచివున్న ప్రమాదం

– రోడ్డుకు అడ్డంగా ఏపుగా పెరిగిన కొబ్బరి చెట్టు

పాలసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త:

పాలసముద్రం మండల పరిధిలో చిత్తూరు–బలిజకండ్రిగ రహదారిలో ఎస్ఎన్‌జె షుగర్ ఫ్యాక్టరీ కార్యాలయ ఆవరణలో ప్రయాణీకులకు ప్రమాదం పొంచివుంది. ఈ రహదారిలో ఓ కొబ్బరి చెట్టు రోడ్డుకు అడ్డంగా ఏపుగా పెరిగి వుండటం, కింద విద్యుత్ లైను వెళ్తుండటంతో ఎద్దైనా ప్రమాదం జరిగితే ఇటు ప్రాణ నష్టంతో పాటు ఆస్తినష్టం జరిగే అవకాశం వుంది. చాలా రోజులుగా ఈ సమస్య అధికారులకు తెలిసినా ఈ సమస్యను పరిష్కరించడానికి వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి లేదా గ్రామ రెవెన్యూ అధికారి స్పందించి రోడ్డుకు అడ్డంగా ప్రమాదంగా వున్న కొబ్బరి చెట్టును తొలగించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్పందన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యను పరిష్కరించుకోవచ్చునని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## జగన్‌ను గద్దె దించితేనే రాష్ట్రషానికి పట్టిన కర్మ పోతుంది

– మాజీ మంత్రి పరసారత్నం



బాలాయపల్లి, జనవరి 22, ప్రభాతవార్త:

సీఎం జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించితేనే రాష్ట్రానికి పట్టిన కర్మ పోతుందని మాజీ మంత్రి పరసా రత్నం తెలిపారు. మండలంలోని జార్లపాడు, పిగిలాం కొత్తపాళెం గ్రామాలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ మంత్రి పరసా వెంకటరత్నంలు నిర్వహించారు. గ్రామాల్లో వారు కరపత్రాలు పంచుతూ వైసీపీ అరాచకాలు ఎండగడుతూ పెంచిన నిత్యావసర వస్తువుల సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేస్తూ సాగిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం వైసీపీ ప్రభుత్వం దళితులను పట్టించుకోవడంలేదు, కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వడంలేదని మాజీ మంత్రి పరసారత్నం విమర్శించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ఇసుక, మద్యం, గ్రావెల్ మాఫియా ఎక్కువైందని ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. పేదలకు ఒక నెల పెన్షన్ ఇచ్చి రెండో నెలలో కుంటి సాకులు చెబుతూ పెన్షన్లు తొలగిస్తూ పేదల కడుపు కొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్‌నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా ప్రచారం నిర్వహించిన వెంకటేశ్వరరెడ్డి

వెంకటగిరి, జనవరి 22, ప్రభాతవార్త:



తనను గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని పీడీఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం వెంకటగిరి పట్టణంలో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే అందరికీ అండగా ఉంటానని చెప్పారు. ఆయన ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేషన్లు కలిసి గెలిపించాలని కోరారు.

## లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ మస్తాన్‌యాదవ్

వెంకటగిరి, జనవరి 22, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ప్రముఖ న్యాచురోపతి వైద్యులు డాక్టర్ బొలిగల మస్తాన్‌యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ జన్మదినం సందర్భంగా సంబరాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. నారా లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం అడ్డు చెప్పడం దారుణమ న్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా టీడీపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు చెప్పిన విధంగా నడుచుకుంటానని ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం, జనవరి 22 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం టపాయిండ్లు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు, నాయుడుపేట మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వసంతమ్మ, పోలయ్యలు మోటార్‌బైక్‌పై సూళ్లూరుపేటకు వెళుతున్నారు. సూళ్లూరుపేట నుంచి మేలుపాక గ్రామానికి వస్తున్న సంతోష్ మోటార్‌బైక్‌పై వెళ్తుండగా ఢీకొన్నాయి.ఈప్రమాదంలోముగ్గురికిగాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## లోకేష్‌బాబు పాదయాత్ర చేసి తీరుతాడు

దొరవారిసత్రం, జనవరి 22 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువతరానికి ఆదర్శనీయుడు నారా లోకేష్‌బాబు ఖచ్చితంగా పాదయాత్ర చేపడతాడని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రౌడీ రాజకీయాలు పోలీసులను పెట్టుకొని విచ్చలవిడిగా చేస్తున్న ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వం అరాచకాలను గమనిస్తున్నారని అన్నారు. లోకేష్ పాదయాత్రను ఖచ్చితంగా చేసి తీరుతారని చెప్పారు. పోలిరెడ్డిపాలెం పంచాయతీలోని ప్రతి ఇంటా ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. వీరితో పాటు తిరుపతి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులునాయుడు, నాయకులు షేక్ షబ్బీర్, గోను జకరయ్య, బాబునాయుడు, కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి, పురుషోత్తం, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మానవ తప్పిదాల వల్లనే రోడ్డు ప్రమాదాలు

-నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య

- ఓజిలి రాజుపాలెంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు

ఓజిలి, జనవరి 22 ప్రభాతవార్త

మానవ తప్పిదాల వల్లనే అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్స వాలలో భాగంగా ఆదివారం ఓజిలి మండలం రాజుపాలెం జాతీయ రహదారిపై డ్రైవర్లు, హెల్పర్లు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి బి.అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయుడుపేట సీఐ వైవి సోమయ్య మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు



నడిపేవారుతప్పకుండానియమాలుపాటించాలన్నారు.ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెల్ ధరించాలన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు.ఈ సందర్భంగా డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సూళ్లూరుపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి బి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు రక్షణగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో రహదారి భద్రత వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు రాజుపాలెం, పెద్దపరియ రాచపాలెం, బ్లాక్‌పార్ట్ ఏరియాలను పరిశీలించి తగు సూచనలు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య, సూళ్లూరుపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి బి.అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనలో ఆక్వా రైతులు

కోట, జనవరి 22 ప్రభాతవార్త

ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లుల కష్టాలు తీరడం లేదు. ఒక పక్క ఆకాశాన్నంటుతున్న మేతల ధరలు, మందుల ధరలతో పాటు దిగుబడికి సరైన ధరల్లేక విలవిల్లాడుతుంటే విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు మరింత భారంగా మారాయి. ప్రభుత్వం ఆక్వా రంగంలో విద్యుత్ యూనిట్ ధరను రూ.1.50 నుంచి రూ.3.84కు పెంచిందని కోట మండలం పుచ్చలపల్లి మాజీ జలసంఘం అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 10 ఎకరాలు లోపు రాయితీ వర్తింపచేస్తామని ప్రకటించినప్పటికీ సచివాలయాల్లో కొర్రీల కారణంగా అది అమలు కావడం లేదన్నారు. ఆక్వా రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

సూళ్లూరుపేట, జనవరి 22 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని కోళ్లమిట్ట సచివాలయం పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా ప్రవేశపెడుతున్నప్పటికీ అవి ప్రజలకు నేరుగా అందుతున్నాయా లేదా అనే అంశంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గడప గడపకు మన ప్రభుత్వం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి ప్రజాప్రతినిధులను ఇంటింటికి పంపి సంక్షేమ పథకాల వివరాలు సేకరిస్తున్నారని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందకపోతే సంబంధిత శాఖల అధికారులతో చర్చించి అర్హులందరికీ ఈ పథకాలను వర్తింపచేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తానని సంజీవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, గోగుల తిరుపాల్, కౌన్సిలర్ పముజుల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు - ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి, జనవరి 22 ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిన్నప్పరెడ్డిపల్లె, దొమ్మరిపాళ్యం, దెయ్యాల గడ్డ గ్రామాల్లో ఆయన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 150 ఇళ్లకు నేరుగా వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ధి కలిగిస్తామన్నారు. మూడేళ్ల పాలనలో సిఎం జగనన్న కోట్లరూపాయలను ప్రజా సంక్షేమానికి కేటాయించారన్నారు. గాంధీజీకలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనలో భాగంగా సచివాలయ వ్యవస్థ అందుబాటులో తెచ్చి ప్రజల ముంగిటకే పాలన తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ హేమంత్‌రెడ్డి, జడ్పీటిసి సుష్మ, మండల కన్వీనర్ బాగారెడ్డి, ఎంపిపి రెడ్డెప్ప, పిఎసిఎస్ ఛైర్మన్ శంకరప్ప, వైస్ ఎంపిపి బాబు, సర్పంచుల సంఘ అధ్యక్షుడు హరి, సర్పంచ్ ధనుంజయరెడ్డి, ఎంపిటిసి చంద్రారెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు సురేష్, శ్రీనివాసులు, రాజారెడ్డి, తమ్మిరెడ్డి, సర్పంచులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలి

తవణంపల్లె, జనవరి 22 ప్రభాతవార్త:



త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి ఆత్మజ్ఞానులు కావాలని త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞానవేదిక–ప్రబోధ సేవాసమితి, బంగారుపాళ్యం–2 కమిటీ అధ్యక్షుడు పుల్లూరు ధనంజయ అన్నారు. ఆదివారం సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం–2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం మండలంలోని మడవనేరి గ్రామంలో యోగి వేమన పద్యాల యొక్క నిగూఢ తత్వార్థ బోధిన గ్రంథాల త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంధములపై ఇందూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.సభ్యులు పుల్లూరు ధనంజయ,చటర్జి, హేమంత్, కిరణ్, హర్షవర్ధన్, లత,చాముండీ, విమలమ్మ,నాగమ్మ, శాంతమ్మ, మంజుల,రెడ్డి జ్ఞానవతి, రేఖకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర ధ్యాన సాధన ద్వారా ఆత్మ సాక్షాత్కారం



–సీనియర్ పిరమిడ్ మాస్టర్ గోపాలకృష్ణమూర్తి

తవణంపల్లె, జనవరి 22 ప్రభాతవార్త:

ఆత్మే పరబ్రహ్మమని తద్వారా అన్ని సమాకూర్చుకోవచ్చునని నిరంతర ధ్యాన సాధన ద్వారా ఆత్మ సాక్షాత్కారం జరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని అరగొండ–చిత్తూరు రహదారిలోని సిద్ధపంల్లె వద్ద వెలసిన శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ శక్తి క్షేత్రం నందు ఆదివారం ఆత్మజ్ఞాన సదస్సులో చిత్తూరు జిల్లా స్పిరుచ్యువల్ సొసైటీ మరియు గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. నిరంతరం మన ఆరాధించే రాముడు, కృష్ణుడు, బుద్దుడు లాంటి వారు ఒకప్పుడు సాధారణ మావులేనని నిరంతరం ధ్యానసాధన ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది దేవుళ్ళుగా మన చేత ఆరాధింపబడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్‌లు బాలాజీ, రాధికచే ధ్యానం పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

## రహదారి ఆక్రమణ బయటపడుతుందనే ఆరోపణలు

యర్రావారిపాలెం, జనవరి 22 ప్రభాతవార్త

రహదారి ఆక్రమణ బయటపడుతుందనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నడాని యర్రావారిపాలెం మండలం బండమీదకమ్మపల్లెకు చెందిన మహేష్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బండమీదకమ్మపల్లె నుంచి బిర్జేపల్లె ద్వారా కొంగరవారిపల్లె వద్ద నెరబైలుకు కలిసే రోడ్డును సర్వే నెంబరు 441ని మురుగేష్‌అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని అందువల్ల వాహనాలు అన్ని తన పొలం మీదుగా వెళుతున్నాయని రహదారిని సర్వే చేయమని అధికారులను తాను కోరానని చెప్పారు. ఈ క్రమంలో అధికారులు ఇటీవల వచ్చి సర్వే చేసారని, అప్పుడు మురుగేష్ వ్యక్తి అడ్డుకున్నాడని తనపై దౌర్జన్యం చేయగా తాను యర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లోఫిర్యాదు చేశానన్నారు. అదేవిధంగా తనపైన మురుగేష్ పిర్యాదు చేయడంతో తనపైనా కేసు నమోదు చేశారన్నారు. అనంతరం 21వతేదీన అధికారులు వచ్చి సర్వేనుపూర్తి చేసివెళ్లారని, ఈలోగా తనపైన పోలీసుల పైన తప్పుడు ఆరోపణలు చేస్తూ మురుగేష్ సేల్ఫీ వీడియో తీసి పెట్టాడని చెప్పారు. తమ ఇద్దరి మద్య ఉన్న తగరాదును రాజకీయ కోణంలోకి తీసుకుపోయారని వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరాడు.

# అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..విజయకుమార్

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

అరాచక, అవినీతి వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు.తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో ఆదివారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 27వ వార్డు ఇన్‌ఛార్జిలు అనితమ్మ, సుబ్బరత్నమ్మ, వసీం, సుధాకర్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. ఈసందర్భంగా విజయకుమార్ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు,ఇసుక,ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. ఈసం



దర్భంగావార్డు ప్రజలు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగానష్టపోయామనిచివరికిఅర్హతఉన్నవారిఫించన్లు, రేషన్‌కార్డులు కూడా తొలగించారని తెలుగుదేశంపార్టీనాయకుల దృష్టికి ప్రజలు తెచ్చారు. ఈనెల 27 నుంచి నారాలోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర కొనసాగనుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్ల మెంటు కోశాధికారి కంటా రమేష్, తిరుపతి పార్లమెంటు రైతు నాయకుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, ప్రసాద్ నాయుడు, సుమతమ్మ, గోపినాథ్, కాసరం రమేష్, వినయ్, మునికృష్ణ, ప్రతాప్, దిలీప్‌కుమార్, మురళీ, దొరబాబు, బషీర్, ఎం ఎస్‌రెడ్డి,గోపినాయుడు,భాస్కర్‌గౌడ్,పురుషోత్తమనాయుడు, తిరుకాల హరి, మణి, వెంకటరమణ, యాదగిరి, సుధాకర్, రవీందర్ నాయుడు, నారాయణగుప్తా, సురేష్‌నాయుడు, సునిమా, హేమంత్ తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## విశ్రాంత గ్రంథాలయాధికారి మృతి



శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

పట్టణంలోని కొండమిట్టలోనివాసం ఉంటున్న విశ్రాంత గ్రంథాలయాధికారి పుష్పాలవెంకటకృష్ణయ్య ఆది వారం ఆకస్మికంగా మృతిచెందాడు. శ్రీకాళహస్తి పట్టణంలో అందరికి సుపరిచయస్తుడుగా ఉన్న ఆయన మృతి తీరనిలోటని పలువురు సంతాపం తెలిపారు. సుమారు 40సంవత్సరాలుగా గ్రంథాలయాధికారిగా పనిచేసి ఎలాంటి వివాదాలు లేకుండా అందరితోకలివిడిగా ఉన్న ఆయన మృతిపట్ల ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూదన్‌రెడ్డితో పాటు, ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, వార్డు ఇన్‌ఛార్జి వైకాపా నాయకుడు మురళీ, వైకాపా నాయకులు కంటా ఉదయ్‌కుమార్‌తో పాటు పలువురు ఆయన మృతికి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## యోగివేమన జయంతి

శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని జెట్టిపాళెం, ముత్యాలమ్మగుడివీధి, కోర్టు పరిసరాలు,సంతమైదానం పరిసరాల్లో యోగివేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆచార్య ప్రభోధానందయోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో వేమన జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా వేమన పద్యాల్లోని 'నిగూఢ తత్వార్థ బోధిని మరియు త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల హిందూధర్మ ప్రచార సభ నిర్వహించబడింది. ఇంటింటా గ్రంథాలను పరిచయం చేసారు. ఈ సందర్భంగా బోధకులు వివరిస్తూ నేటి కాలంలో మానవుడు పొద్దున లేచింది మొదటు రాత్రి పడుకునే వరకు ఎన్నో వ్యాపకాలు, ఆలోచనలుతో సంపాదనే ధ్యేయంగా జీవిస్తున్నారని దేవుని తెలుసుకోవటానికి కూడా సమయం లేదంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షుడు సుబ్రమణ్యం, సభ్యులు ఉదయ్‌కిరణ్,సురేష్‌యాదవ్, వెంకటలక్ష్మీ, జయసుధ, అమరావతి, సుధ తదితరులు పాల్గొన్నారు.

## విఎంపల్లిలో ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని విఎంపల్లిలో ప్రెస్‌క్లబ్ సారధ్యంలో ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు.సుమారు 300 మంది శిబిరంలో వైద్య పరీక్షలు చేయించారు.ఎంజిఎం వైద్యులు రోగులను పరీక్షించారు.ఉచితంగా మందులు అందించారు. ఈసందర్భంగా ఎంజిఎం నిర్వాహకులు గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు. మారుమూల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాన్ని అధ్యక్షులు కామేష్, కార్యదర్శి చంద్రమౌళి, విసి వెంకటయ్య 1వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పసల సురేష్, ధర్మకర్తల మండలి సభ్యురాలు పసల సుమతి, పసల రమణయ్య, రామచంద్రయ్య ఎంజిఎం వివేక్ చైతన్య, తేజస్విని, శివకిషోర్, ఉమామహేశ్వర్‌రావు, మధు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## జూలై నుంచి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ రద్దు

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త



జూలై నుంచి సింగల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం రద్దుచేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. మున్సిపల్ కార్యాయలంలో ప్లెక్సీ బ్యానర్ల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తక, వాణిజ్య సముదాయాల యజమానులతో మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను జూలై నుంచి రద్దుచేస్తున్నామని, 120మైక్రాన్స్ కాన్న తక్కు ఉన్న ప్లాస్టిక్ కవర్లను గత ఏడాది ఈ31వతేదీనుంచి రద్దు చేశామరని అయితే ఈనెల 26నుంచి ప్లాస్టిక్ బ్యానర్లను నిషేదించామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్క్వయర్‌ఫీట్‌కు రూ.100 నుంచి అపరాధ రుసుము విధించనున్నామన్నారు. ప్రతి సచివాలయంలో సిబ్బంది, వాలంటీర్లు పొదుపు సంఘాల మహిళలు కూడా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దీనిపై పట్టణంలో ప్రత్యేకంగా మైక్ ద్వారా సమాచారం అందిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయంలో టాక్స్‌పోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అందరు వ్యాపార, వాణిజ్యసముదాయ అధికారుల సహకరించి పురపాలక సంఘ అధికారలుకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటర్ ఇంజనీర్ సాయిసింధు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పట్టణ వర్తక, వాణిజ్య సముదాయాల యజమానులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త



పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ 133వ నెల కార్యక్రమం పెద్దమసీదువీధిలోని రెండో బ్రాంచి వద్ద సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా మరియు సభ్యుల చేతులమీదుగా విచ్చేసిన దివ్యాంగులకు నిత్యావసర సరుకులును పంపిణీచేశారు. ఈసందర్భంగా మునీర్‌బాషా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా క్రమం తప్పకుండా ప్రతినెలా సంస్థ ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు అందిస్తున్నామని ఇదే సంస్థలో పనిచేస్తున్న సభ్యులు కూడా తమ వంతు సాయంగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కంటా ఉదయ్‌కుమార్, మల్లీశ్వరి, కోళ్ళూరుహరనాథ్‌నాయుడు, బాబాఫరీద్ మరియు దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు పవన్ మరియు హెల్పింగ్ హ్యాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా నుంచి వైకాపాలోకి వలసల జోరు

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గుత్తివారిపల్లి గ్రామంకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు సుమారు 30 మంది పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. వైకాపాలో చేరిన వారిలో కృష్ణారెడ్డి, గురవయ్య, హేమాద్రిరెడ్డి, సుధాకర్, చీరాలరెడ్డి, నాగభూషణం, కోదండపాణిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చెంగల్రాయులు, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులకు వైకాపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రేణిగుంట మండల నాయకఉలు మునిరెడ్డి, ధనంజయరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, మరియు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి టెన్నిస్‌పోటీలు: 25 నుంచి మెయిన్ డ్రా

శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో సోమవారం నుంచిఏఐ ఎస్టీఏ టెన్నిస్ పోటీలు ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. శ్రీకాళహస్తిలోని విక్రమ్ టెన్నిస్ ఆకాడమి క్రీడా ప్రాంగణంలో ఏపోటీలకు ముస్తాబు చేస్తున్నారు. శ్రీకాళహస్తిలోని రిపబ్లిక్ క్లబ్ 35 సంవత్సరాల పాటు నిరాటంకంగా టెన్నిస్ పోటీలను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించి గణతికెక్కారు. నాలుగు సంవత్సరాలుగా క్లబ్ పోటీలు నిర్వహించటం లేదు. అయితే టెన్నిస్‌పై మక్కువ ఉన్న విక్రమ్ టెన్నిస్ క్లబ్ నిర్వాహాకులు డాక్టర్ చంద్రశేఖర్ పోటీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు సీడెడ్ ప్లేయర్ల మధ్య మెయిన్ డ్రా ఉంటుందని వివరించారు. ఆరు రోజుల పాటు నిర్వహించే పోటీలు ఈ నెల 29న ముగుస్తాయని తెలిపారు.శ్రీకాళహస్తిలో వమొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న ఆలిండియా నేషనల్ సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ మెయిన్ డ్రా పోటీలను స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రారంభిస్తారని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విజేతకు రూ.4లక్షలు ప్రైజ్‌మని ఆయన వివరించారు. పట్టణ ప్రజలు క్రీడాభిమానులు పోటీలను తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసామని జయప్రదం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఏ ఆర్థిక సహాయం

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం దళితవాడకు చెందిన చెంగమ్మ,రామచంద్రాపురానికి చెందిన అమ్ములు, శ్రీకాళహస్తి పట్టణంలోని బిపి అగ్రహారానికి చెందిన సుబ్రమణ్యం అనారోగ్యంతో మృతి చెందారు.కుటుంబ పోషకులు మృతిచెందటంతో ఆ కుటుంబాల పోషణ కష్టమైంది. ఈ సమాచారం తెలుసుకున్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి స్పందించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఆ కుటుంబాలను పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి ఉడుతా భక్తిగా రూ.పది వేలు చొప్పున అందజేసి ఆ కుటుంబాలకు ఉంటామని ధైర్యం చెప్పారు. కాగా కొండమిట్టలో మృతి చెందిన రిటైర్డ్ గ్రంధాలయ అటెండర్ వెంకటకృష్ణయ్య, ప్రాజెక్టు వీధిలోమృతిచెందిన నైనారు సుబ్రమణ్యం కుటుంబాలను పరామర్శించి మృతులకు నివాళులర్పించారు.

## యువనేస్తం సారధ్యంలో గిరిజన కాలనీ చిన్నారులకు విద్యాసామగ్రి

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రామాపురం గిరిజన కాలనీలో చదువుకుంటున్న చిన్నారులకు యువనేస్తంసారధ్యంలోఆదివారంవిద్యాసామగ్రిని అందించారు.ఈ గిరిజన కాలనీలోని చిన్నారులు కాయకష్టం చేసుకుంటూ సాయంత్రం బడిలో అక్షరాలు నేర్చుకుంటున్నారు.ఈ చిన్నారుల శ్రద్ధను గుర్తించిన యువనేస్తం అధ్యక్షుడు మునిశేఖర్ వారిని విద్యవైపు ఆకర్షించటానికి పుస్తకాలు,పలకలు, బలపాలు, పెన్ను, పెన్సిల్, మెండెర్,రబ్బరు,జడరిబ్బన్,పౌడర్‌లను అందించారు.గిరిజనులు బాగా చదువుకొని రాణించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో కార్యదర్శి జస్వంత్, చారిటబుల్‌ట్రస్టుఅధ్యక్షుడువినోద్,యువనేస్తంసభ్యులునాగమణి,వెంకటేష్,స్రవంతి పాల్గొన్నారు.

## దందోలును పరామర్శించిన బొల్లినేని

శ్రీకాళహస్తి రూరల్,జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దీర్ఘకాలం రాజకీయం నడిపిన దందోలు భక్తవత్సల ంరెడ్డి అనారోగ్యంతో ఉన్నారు. ఆయన్ను ఆదివారం బొల్లినేని జగన్నాధం నాయుడు పరామర్శించారు.ఇటీవల దందోలు భక్తవత్సల రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యసహాయం తీసుకొని తమ స్వగ్రామమైన తొండమనాడుకు వచ్చారు. ఆయనను జగన్నాధం నాయుడు తన అనుచరులతో కలసి విచారించారు. త్వరగా కోలుకొని రాజకీయాల్లోరాణించాలని కోరారు. అంతేకాక రాబోవు ఎన్నికల్లో తాను ఇండిపెండెంటుగా శాసనసభ్యుడుగా పోటీ చేస్తున్నానని తనకు సహాయం అందించాలని కోరారు.ఆయనతో పాటు పాపనపల్లి మాజీ సర్పంచ్ రామచంద్రయ్యయాదవ్, సూరావారి పల్లి ప్రసాద్‌రావు, ఉడమలపాడు సుబ్రమణ్యం యాదవ్, శివయ్య యాదవ్,పాతగుంట సుబ్రమణ్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు..ఎంఎల్ఏ

తొట్టంబేడు, జనవరి 22 ప్రభాతవార్త



జగనన్న నవరత్నాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని,అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవరం లేదని ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేమూరు గ్రామం మరియు హరిజనవాడల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్తులు ఎంఎల్ఏకు బ్రహ్మరథం పట్టి పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని కోరారు. అనంతరం ఎంఎల్ఏను గజమాలతో సత్కరించగా, పలువురు మహిళలు ఎంఎల్ఏకు హారతులు పట్టారు. దుష్టచతుష్టయం ఎన్ని ఆరోపణలు చేసినా 2024 ఎన్నికల్లో ప్రజలందరు అండగా ఉంటామని ప్రజలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం,ఎంపిటిసివేమాలయ్య,మండల వైకాపా నాయకులు మునిరత్నం, సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్‌కిషోర్‌నాయుడు,మాజీసర్పంచ్‌హరినాయుడు,గురవారెడ్డి,చలపతి, శేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంగరామిరెడ్డి,మురళీ,విజయ్,మునిరాజరెడ్డి,సుబ్బయ్య,కోటేశ్వరరెడ్డి,రమణయ్య, గాలిబాలాజీనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, గోపి, భాస్కర్‌రెడ్డి, అలంకార్, వెంకటేశ్వర్లు, రఘురాం,డిల్లీబాబు, భక్తవత్సలం, రమేష్, వెంకటేష్ ఇతరవైకాపానాయకులు మరియు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

## వార్తకు స్పందన



శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

పట్టణంలోని దస్కూల్ వద్ద ఉన్న లీకేజీలపై వార్త దినపత్రికలో 'లీకేజీలు అరికట్టండి..తాగునీటిని ఆదాచేయండి' అన్న శీర్షికన వార్త ప్రచురితం కావడంతో స్పందించిన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి అక్కడ లీకేజీలు అరికట్టేందుకు జెసిబితోతవ్వించి పైపులైన్ల మరమ్మత్తులను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. లీకేజీలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్‌అధికారులు తెలిపారు.

# శివనాధపాళెం పంచాయతీలో సమస్యలు పట్టించుకోరా?

-తెదేపా నాయకులకు గ్రామస్తుల మొర

తొట్టంబేడు, జనవరి 22 ప్రభాతవార్త

శివనాధపాళెం పంచాయతీలో సమస్యలను అధికారపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు తెలుగుదేశంపార్టీకి మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు, పలువురు తెదేపా నాయకులకు మొరపెట్టుకున్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని శివనాధపాళెం పంచాయతీలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రజలు మాట్లాడుతూ పంచాయతీ మధ్యలో గంగ కాలువ వెళ్తున్న శివనాధపాళెం గ్రామ వ్యవసాయ



భూములకు నీరు వచ్చే పరిస్థితి లేదని వంతెన నిర్మించాలని తెలిపారు. ఎస్టీ కాలనీకి తారు రోడ్డు సౌకర్యం లేదని వర్షంవస్తే వాహనాలు వెళ్ళే పరిస్థితి లేదని ఇక్కడ వంతెన నిర్మించాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పైపులైను నిర్మాణం లేక తాగు నీరు పైపులు పగిలిపోయి కలుషిత నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అంతేకాకుండా నెల్లిమానుకండ్రిగ గ్రామస్తులు ఎన్నికల సమయంలో సార్వత్రిక ఎన్నికలప్పుడు ఓట్లు సత్యవేడు నియోజకవర్గం, మిగతా సర్పంచ్ ఎంపిటిసి ఎన్నికలకు తొట్టంబేడులో ఓట్లు వేయడం వల్ల తమ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించాలని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా, సుధీర్‌రెడ్డిని శ్రీకాళహస్తి ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరయ్య,మోహన్‌నాయుడు,శంకర్‌నాయుడు, ఆర్ముగం, రమేష్, గోపాల్, అన్నామలై, ఏలుమలై, మణికంఠ తదితరనాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సిమెంటు బస్తాలు పంపిణీ

- మంత్రి రోజా



నగరి, జనవరి 22 ప్రభాతవార్త:

రాజన్న పాలనను ఊరి వద్దకు తీసుకువస్తే జగనన్న నట్టింటి వరకు పాలనను తీసుకెళ్లారన్నారు. శనివారం మండలంలోని బీరకుప్పం గ్రామంలో వర్షాలకు ఉరుస్తున్న ఇల్లున్న వారికి వాటిని బాగు చేసుకోవడానికి 27 కుటుంబాలకు సుమారు రూ.3.5 లక్షలు మతింపు చేసే 850 సిమెంటు బస్తాల సిమెంటును తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఏదో చెప్పి మళ్లీ కనిపించకుండా పోయే ముఖ్యమంత్రి కాదు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు కేవలం వంద కోట్లు ఖజానాలో పెట్టి వెళ్లినా కుంటి సాకులు చెప్పి తప్పించుకోకుండా కుల మతాలకు పార్టీలకు అతీతంగా అర్హత ఉంటే చాలు వారికి సంక్షేమం అందేలా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నయ్యప్ప, వెంకటలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ సెల్వి, ఎంపీటీసీ తులసి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఏళుమలైరెడ్డి, చంద్రారెడ్డి, మునస్వామి, రామచంద్రన్, మధు, వినోద్‌కుమార్, రంగనాథం, గోవర్ధనం తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన

కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్ , జనవరి 22,ప్రభాతవార్త

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 23వ తేది ఉదయం 10 నుండి 11 వరకు డయల్‌యువర్ కమిషనర్ కార్యక్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జిలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. 0877- 2227 208 నంబర్‌కికాల్‌చేసితమఫిర్యాదులుతెలియజేయవచ్చుఅని నేరుగా వచ్చి అర్జిలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## అగ్నివీర్ మెడికల్ అసిస్టెంట్ నియామకానికి పరీక్షలకు చెన్నైలో హాజరు కావాలి

సెట్విన్ సిఇఓ మురళీకృష్ణ

తిరుపతి (క్రీడా), జనవరి 22, ప్రభాతవార్త

భారతీయ వాయుసేనలో అగ్నివీర్ నియామకాలకు సంబంధించి గ్రూప్ వై కేటగిరి నందు మెడికల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత కలిగిన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 4,5 తేదీలలో, గ్రూప్ వై, మెడికల్ అసిస్టెంట్‌కు అవివాహిత పురుషులకు ఫిబ్రవరి 7,8వ తేదీలలో ఫిజికల్ పిట్నెస్ టెస్ట్, వ్రాత పరీక్షా అడాప్టబిలిటి టెస్ట్ 1, అడాప్టబిలిటీ టెస్ట్ 2, మెడికల్ అప్పాయింట్మెంట్‌ని చెన్నైలోని తాంబరం ఎయిర్ ఫోర్సు స్టేషన్‌లో నిర్వహిస్తున్నారు. అందువల్ల ఆసక్తి కలిగిన అభ్యర్థులుపై కనపరిచిన తేదీలలో హాజరుకావాలని కోరారు. అగ్ని వీరు వాయుఉద్యోగాలకు ఎంపిక సంబంధించి సందేహాలను నివృతి చేసకోవడానికి ప్రభుత్వం వారు తెలిపిన వాట్సాప్ నెంబర్ 9345377868 సంప్రదించాల్సిందిగా సెట్విన్ సిఇఓ డా. మురళీకృష్ణ తెలిపారు

## పరిశోధన విద్యార్థి కిరణ్ కుమార్ భట్‌కి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విద్య), జనవరి 22, ప్రభాతవార్త



రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగం పరిశోధన విద్యార్థి కిరణ్ శంకర్ భట్‌కి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షల విభాగం తెలిపారు. సాహిత్య విభాగం ఆచార్యులు చక్రవర్తి రంగనాథవర్యుల మార్గదర్శకంలో ఆచార్యులు హెచ్‌వి నాగరాజ చేత రచింపబడిన శతకకావ్యాల సాహిత్యక దృష్టిలో విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకు గాను ఇతనికి డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు తెలిపారు. ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. కిరణ్ శంకర్ భట్‌కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురుఆచార్యులు,పరిశోధకులు,బంధుమిత్రులుతమఆనందాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కేవీబీ పురం, జనవరి 22 ప్రభాతవార్త:



కేవీబీ పురంలో శ్రీ పద్మావతి అభ్యుదయ మహిళా సంఘం వెంకటేశ్వర అరవింద్ వారిచే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మహిళా అభ్యుదయ సేవా సంఘం చైర్‌పర్సన్ సరస్వతి, ఆ సంఘం మేనేజింగ్ డైరెక్టర్ వెంకట మురుగేష్, కేవీపీ పురం మండలం జానికాపురం, రాజేశ్వరి, అంకయ్య, అరవింద కంటి ఆస్పత్రి ప్రముఖ వైద్యులు ఉచిత శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరానికి మండల ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతంలో ఉచిత కంటి వైద్యం చేయడంతో మాకెంతో ఆనందంగా ఉందని పద్మావతి మహిళా అభ్యుదయ సేవా సంఘం చైర్‌పర్సన్ సరస్వతి, అరవింద ఆస్పత్రి కంటి వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం180 మంది పాల్గొనగా ఇందులో 26 మంది రెఫరల్, 90 మంది ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.పాఠశాలప్రధానోపాధ్యాయుల్లువెంకటకృష్ణయ్య, సంఘం సభ్యులు, రోగులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమంలో ముందడుగు - మంత్రి రోజా

వడమాలపేట, జనవరి 22 ప్రభాతవార్త:



అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నగరి నియోజకవర్గం ముందడుగు వేస్తున్నట్లు మంత్రి రోజా పేర్కొన్నారు. ఆదివారం వడమాలపేట మండలం వడమాల గ్రామంలో జీపీపీ నిధులు 5 లక్షలు, ఎమ్మెల్యే నిధులు 10 లక్షలు మొత్తం 15 లక్షల అంచనా వ్యయంతో డ్రైనేజీ కాలువలు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఝాన్సీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో అరుణ, వ్యవసాయ అధికారి విజయకుమార్, ఏపీఎం మునికృష్ణారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్‌ఎంపీపీలు లోకేశ్వర్‌రెడ్డి, ఉపేంద్రవర్మ, సర్పంచ్‌లు అంజమ్మ, శ్రీవిద్య, ఎంపీటీసీ రవి, సురేష్‌రాజు, కరుణాకర్‌చౌదరి, శేఖర్, ఉమాపతి, మునిబాబు, వెంకటేష్, రేణుకాకిరణ్, వెంకటరెడ్డి, డబ్బు మురళి, వేణు, బాల, మునిశేఖర్, బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మల్లికార్జున్ మృతి

వైసిపి బిసి సెల్ మండల కార్యదర్శిగా సేవలు



చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త:

వైసిపి బిసి సెల్ మండల కార్యదర్శి మల్లికార్జున్ (45) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పనపాకం పంచాయతీకి చెందిన మల్లికార్జున్ చంద్రగిరి నుండి పనపాకం వెళుతుండగా కాశిపెంట్ల వద్ద డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు మరో వైపున పడ్డాడు. దీంతో అటుగా వెళుతున్న లారీ తొక్కుకుని వెళ్ళడంతో మల్లికార్జున్ అక్కడికక్కడే మృతి చెందారు. మల్లికార్జున్ మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నాయకులు ఆవేదన చెందారు. మృతుడికి భార్య, కుమార్తె వున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మేమంతా మదన్న పక్షం వైకాపాలోకి భారీ వలసలు

రేణిగుంట, జనవరి 22 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం గుత్తివారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం ఉదయం వైకాపా కండువాలు కప్పుకున్నారు. దాదాపు 30 మంది శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి వైకాపాలో చేరారు. కృష్ణారెడ్డి, గురవయ్య, హేమాద్రిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చీరాల రెడ్డి, నాగభూషణంరెడ్డి, కోదండపాణిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, చెంగల్రాయులు, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రజల కోసం చేస్తున్న సేవల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో రేణిగుంట మండల నాయకులు మునిరెడ్డి, ధనంజయరెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆషా ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

రేణిగుంట, జనవరి 22 ప్రభాతవార్త:



ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని గుత్తివారిపల్లి సర్పంచ్ మంజుల అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లి పంచాయతీ నందలి ఆర్‌పీ అగ్రహారంలో ఆదివారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గుత్తివారిపల్లి సర్పంచ్ మంజుల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆషా సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. జూలియన్ రాజు మాట్లాడుతూ పేదలకు తనవంకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు చేసేందుకు సహకరిస్తున్న గ్రామ పెద్దలు, యువత, సర్పంచ్ మంజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆషా సంస్థ ముఖ్య సలహా దారులు అమ్ములురాజు, అనిల్, ఆశ వర్కర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ గ్యాలరీ నిర్మాణానికి రూ.45 లక్షలు

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బంగారుపాళ్యం, జనవరి 22 ప్రభాతవార్త:
బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ గ్యాలరీ నిర్మాణానికి 40 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక క్రీడా మైదానంలో జరుగుతున్న దక్షిణ భారత వాలీబాల్ పోటీలను మంత్రి తిలకించారు. ఈరోడ్డు మహిళా జట్టు, కేరళ మహిళా పోలీస్ జట్ల క్రీడాకారులను మంత్రి పెద్దిరెడ్డి పరిచయం చేసుకొన్నారు. అంతకుముందు మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడకు బంగారుపాళ్యం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. ఈ క్రీడా మైదానంలో పలువురు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా పేరు గడించారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రీడా మైదానంలో ఆటను వీక్షించడానికి స్పోర్ట్స్ గ్యాలరీ ఎంతో అవసరమని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ గ్యాలరీ నిర్మాణానికి 45 లక్షలు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వున్న క్రీడాకారులను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు తులసీరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి మురారి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, మాజీ జిల్లా వాలీబాల్ కోచ్ సుదర్శన్‌నాయుడు, పలువురు వాలీబాల్ క్రీడాకారులు, వైకాపా నాయకులు, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బెన్నురాజ్, ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేరళ మహిళా జట్టుతో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

## మహిళా వాలీబాల్ విజేత కేరళ పోలీస్ జట్టు



బంగారుపాళ్యం, జనవరి 22 ప్రభాతవార్త:
బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న దక్షిణ భారత వాలీబాల్ పోటీలో మహిళా విభాగంలో కేరళ మహిళా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. చెన్నై బ్రిడ్జ్ రూపే ప్రమియమ్ ఆధ్వర్యంలో ఈపోటీలు జరుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఈపోటీలు ప్రారంభం కాగా ఆదివారం రాత్రి ఫైనల్ పోటీలు నిర్వహించారు. మహిళా విభాగం నందు కేరళ మహిళా పోలీసు ఎస్ఆర్ఎం మహిళా పోలీసు జట్లు మధ్య ఫైనల్ పోటీలు జరిగింది ఈపోటీనందు వరుసగా రెండు సెట్‌లను కేరళ మహిళా పోలీసు జట్లు ఎస్ఆర్ఎం మహిళా పోలీసు జట్టుపై విజయం సాధించింది. గెలుపొందిన కేరళ మహిళా పోలీసు జట్టుకు 40 రూపాయల నగదు, మెమెంటో కప్‌ను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు తులసిరెడ్డి, కృష్ణారెడ్డిలు అందజేశారు. అలాగే ద్వితీయస్థానంలో వున్న ఎస్ఆర్ఎం మహిళా జట్టుకు 30 వేల రూపాయలు, మూడో స్థానంలో వున్న భారతీయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి జట్టుకు 20 వేలు నాలుగో స్థానంలో వున్న ఈరోడ్ మహిళా జట్టుకు 10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. మాజీ జిల్లా వాలీబాల్ కోచ్ సుదర్శన్‌నాయుడు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంబి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రపై ఉమ్మడి జిల్లా కీలకనేతల సమావేశం



కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ ఈనెల 27న కుప్పం నుంచి చేపట్టబోయే యువగళం పాదయాత్రకు సంబంధించి ఆదివారం కుప్పంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులు సమావేశమయ్యారు. తొలిరోజు కుప్పం నుంచే పాదయాత్ర మొదలు కానుండడంతో పాటు బహిరంగసభలో సైతం నారా లోకేష్ ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర విజయవంతానికి సంబంధించి ముఖ్యనేతలు చర్చించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పులివర్తినాని, సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, శంకర్ యాదవ్, దొమ్మలపాటి రమేష్, నగరి ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్, ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు గోపీనాథ్, గాజుల ఖాదర్ బాషా, మీడియా ఇన్‌చార్జ్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి రోజాచే వైఎస్ఆర్‌టిఎఫ్ డైరీ ఆవిష్కరణ



చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:
వైఎస్ఆర్‌టిఎఫ్ డైరీని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఆదివారం నగరిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ వైఎస్ఆర్‌టిఎఫ్ క్యాలెండర్‌ను ఆకర్షనీయంగా రూపొందించిందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, విద్యావసతి తదితర కార్యక్రమాలను కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.ధనంజయరెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకాంత్, నాయకులు కార్తీక్‌రెడ్డి, సిఆర్ జ్యోతిప్రసాద్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## 27నుండి విశాఖలో చతుర్వేద హవనం



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త:
టిటిడి హిందూధర్మప్రచారపరిషత్, ఎస్వీఉన్నతవేద అధ్యయనసంస్థ సంయుక్తంగా 27నుంచి 31వరకు మూడురోజులు విశాఖపట్నం పెందుర్తిలో శారదాపీఠంలో చతుర్వేద హవనం జరగనుంది. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్రసరస్వతి స్వామి ఆశీస్సులతో లోకకల్యాణం కోసం ఐదురోజులు ఈ చతుర్వేద హవనంలో పండితులు పాల్గొంటారు. ఏర్పాట్లను ఆదివారం తిరుపతి జెఇఓ సదాభార్గవి పరిశీలించారు, స్వాములను కలిసి హవనం నిర్వహణపై సూచనలు తీసుకున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షలు



పుత్తూరురూరల్, జనవరి 22 ప్రభాతవార్త:
పుత్తూరులోజరిగిన కానిస్టేబుల్ పరీక్షలకు 644 మందికి గాను 6026 మంది హాజర య్యారని ఏఎస్పీ క్రైమ్ విమలకుమారి తెలి పారు. పుత్తూరులో జరిగిన 13 సెంటర్‌ల్లో నిర్వహించి పరీక్షలు డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో ఎటువంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగింది.

## చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పనితీరు భేష్

### - రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ రామిరెడ్డి

కోట, జనవరి 22 ప్రభాతవార్త
కోట మండలం చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం పనితీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రామిరెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన చిట్టేడు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని వార్డుల్లో కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1142 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయన్నారు. అదే విధంగా 10,032 హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డిప్యూటి డిఎంహెచ్ఓ హనుమంతరావు, వైద్యాధికారి నాగరాజు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నుంచి వసూళ్లు!

### టీసీ తీసుకెళ్ళాలంటే రూ.1000 ఇవ్వాలని డిమాండ్!!

పాలసముద్రం, జనవరి 22 ప్రభాతవార్త:
ఇప్పటి వరకు మనం ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను దోపిడి చేస్తుండే వార్తలు మాత్రం విన్నాం. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఓ హెడ్మాస్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి వసూళ్లు చేసిన వ్యవహారం వెలుగుచూసింది. పాలసముద్రం మండలం కెజెపురం పంచాయతీ బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు టీసీ, మార్క్‌షీటు తీసుకెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పాస్ అయిన విద్యార్థులు ఎవరైనా వెళ్ళి తమకు టీసీ, మార్క్‌షీటు కావాలని అడిగితే అక్కడి హెడ్మాస్టర్ మంచి కళాశాలలో చేరి బాగా చదువుకోవాలని సూక్తులు చెప్పి వారికి కావాల్సిన టీసీ, మార్క్‌షీట్లను ఇచ్చి పంపుతారు. అయితే బలిజకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వద్దకు టెన్త్ పాసైన విద్యార్థులు ఎవరైనా వెళ్ళి తమకు టీసీ, మార్క్‌షీటు కావాలని అడిగితే డబ్బులు ఎంత తీసుకువచ్చావు! నీకు కళాశాలలో చేరడానికి ఇక్కడ సర్టిఫికేట్లు ఎవరు ఉచితంగా ఇవ్వరని కసురుతుండటంతో విద్యార్థులు ఖంగుతినాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వెయ్యి రూపాయిలు ఇస్తే తీసుకెళ్ళి హెడ్మాస్టర్‌కు ఇచ్చి టీసీ, మార్క్‌షీటు తీసుకువస్తానని విద్యార్థులు మొండికేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం 56 మంది విద్యార్థులు టెన్త్ క్లాస్ పాస్ కాగా ఒకొక్క విద్యార్థి నుండి హెడ్మాస్టర్ వెయ్యి రూపాయలు వసూలు చేశారు. ఈ నిధులను హెడ్మాస్టర్ పాఠశాల అభివృద్ధికి కాక తన సొంత ఖర్చులకు వాడుకొన్నట్లు అక్కడి ఉపాధ్యాయులే ఆరోపిస్తున్నారు.

## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

### రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్కె రోజా



విజేతలకు కప్ అందజేస్తున్న మంత్రి ఆర్కె రోజా

తిరుపతి, జనవరి 22, ప్రభాతవార్త
తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన 66వ రాష్ట్ర స్థాయి రోల్ బాల్ క్రీడా పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలను రాష్ట్ర నలుమూలల నుండి అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కె రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడలపట్ల ఆసక్తి చూపడం వల్ల మంచి శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి రోజా హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిగా నిర్వహించిన రోల్ బాల్ టోర్నమెంట్ క్రీడాకారులు, ప్రేక్షకులు కేరింతల మధ్య ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగింది. అంతర్ 17 బాలుర రోల్ బాల్ చాంపియన్ షిప్‌ని చిత్తూరు జిల్లా జట్టు 6-3 స్కోర్ తేడాతో విశాఖపట్నం జిల్లా జట్టుపై ఘన విజయంతో ట్రోఫీని కైవసం చేసుకుంది. అంతర్ 17 బాలికల విభాగంలో ప్రథమ స్థానం కృష్ణాజిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జట్టు, అంతర్ 14 బాలురలు విభాగంలో ప్రదమ స్థానం చిత్తూరు జట్లు, ద్వితీయ స్థానం కృష్ణా జిల్లా జట్టు, అంతర్ 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం కృష్ణాజిల్లా జట్టు, ద్వితీయ స్థానం నెల్లూరు జిల్లా జట్టు గెలుపొందాయి. విజేతలకు మంత్రి రోజా చేతుల మీదుగా క్రీడాకారులకు ట్రోఫీలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, టోర్నమెంట్ అబ్జర్వర్ చంద్రకుమార్, టెక్నికల్ కమిటి శ్రీమన్నారయణ, మదన్ మోహన్, ప్రభాకర్, కోచ్‌లు ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ అసోసియేషన్ టెక్నికల్ బాడీ ఛైర్మన్ విజి ప్రేమ్‌నాథ్, ఆంధ్రప్రదేశ్ రోల్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్, కార్తీక్, రోల్ బాల్ సెక్రటరీ అనిల్ కుమార్ రెడ్డి, పిడిలు శ్రీధర్, పూర్ణచంద్ర, సురేష్, విజయ్ కుమార్, గణేష్, పివి రమణ పాల్గొన్నారు.

## నగరిలో పరుగులు తీస్తున్న అభివృద్ధి : మంత్రి రోజా

నగరి, జనవరి 22 ప్రభాతవార్త:
నగరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నామని మంత్రి రోజా తెలిపారు. నగరి మండలం దేశమ్మగుడిలో నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకును ఆదివారం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిరోజు ప్రజలకు ఏమి చేయాలి, ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచిస్తారని అందుకే నగరి నియోజకవర్గంలో ప్రతి రోజు భూమిపూజ కాని, ప్రారంభోత్సవం కాని నిర్వహిస్తూ అభివృద్ధి, సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పీహెచ్‌సీల రెన్యువేషన్‌లో, అర్బన్ పీహెచ్‌సీల ప్రారంభోత్సవంలో ఫస్ట్‌గా ఉన్నామని తెలిపారు. నగరి పీఏసీఎస్ పాత భవనం స్థానంలో కొత్తగా భవనం నిర్మించి ఆదాయ వనరుల కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ప్రస్తుతం హెచ్‌పీ పెట్రోల్ బంకును మంజూరు చేయించి ప్రారంభోత్సవం చేస్తున్నామని వివరించారు. ముక్కలకండ్రిగ వద్ద 46 కోట్ల 2 లక్షల 25 వేలతో నిర్మిస్తున్న ట్యాంకు నిర్మాణం వలన భూగర్భ జలాలు పెరిగి తాగునీరు, సాగునీరు మరింత అందుబాటులో లోనికి వస్తాయని వివరించారు. సమావేశంలో అప్కాబ్ ఛైర్మన్ ఝాన్సీ రాణి, డీసీసీబీ ఛైర్మన్ రెడ్డెమ్మ కృష్ణమూర్తి, వైస్ ఛైర్మన్ కరుణాకరచౌదరి, డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్, డీసీవో బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో వనజరెడ్డి, తుడా సెక్రటరీ లక్ష్మీ, హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్‌లు రెడ్డి ప్రసాద్, ఉదయ్, కార్తీకేయన్, నగరి పీఏసీఎస్ ఛైర్మన్ తిరుమలరెడ్డి, నగరి, నిండ్ర ఎంపీపీలు, మున్సిపల్ కమిషనర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీ ఛైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త:
కలియుగ వైకుంఠవాసుడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రంను పురస్కరించుకుని ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు వేకువజామున స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప జేశారు. భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామి వారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు

### -తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి



డా॥కృష్ణప్రశాంతి,డా॥హరినాథరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూమన తదితరులు

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 22 ప్రభాతవార్త:
జర్నలిస్టులు అనేవారు సమాజాభివృద్ధిలో భాగస్వాములని,అలాంటి వారు ఆరోగ్య భద్రతను పాటించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు.ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు సాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్,హర్షిత హాస్పిటల్ అధినేతలు డా॥కృష్ణప్రశాంతి,డా॥హరనాథరెడ్డిల ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎంపి డా॥గురుమూర్తి,నగర మేయర్ డా॥శిరీషలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ గతంలో ఆకలి,యుద్ధాలు,కరువు కాటకాలతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారు. అయితే ప్రస్తుతం ఊబకాయంతో రోగాలను కొనితెచ్చుకునే పరిస్థితులు వాటిల్లాయని అన్నారు. డా॥కృష్ణప్రశాంతి సమాజాభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తని, జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం కోసం మెడికల్ క్యాంపును నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం డా॥కృష్ణప్రశాంతి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం జర్నలిస్టులు అందుబాటులో ఉన్న వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని,అలాగే మూర్ఖత్వపు దృష్టి నుండి ప్రజలను మేల్కొలపాలని కోరారు. మేయర్ డా॥శిరీష మాట్లాడుతూ నేడు ప్రజలు వారి ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ మెడికల్ క్యాంపులో సుమారు 180 మంది జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలతో పాటు,షుగర్ పరీక్షలు,బిపి,ఈసీజి,యూరిక్ యాసిడ్,హెచ్‌బిఏ1 పరీక్షలను సైతం నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి,బాలచంద్ర,కమిటీ సభ్యులు,సీనియర్ జర్నలిస్టులు,మెటర్నిటీ హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డా॥సునీత,హర్షిత హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## దావోస్ వరల్డ్ ఎనకమిక్ ఫోరమ్(డబ్ల్యుఈఎఫ్) సదస్సుకు అమరరాజా గ్రూప్ కో ఫౌండర్ ఛైర్మన్ గల్లా జయదేవ్



దావోసులో గల్లా జయదేవ్

రేణిగుంట, జనవరి 22 ప్రభాతవార్త:
ప్రపంచ దావుస్ ఎకనామిక్స్ సదస్సుకు అమరరాజా గ్రూప్ సంస్థల కో ఫౌండర్, ఛైర్మన్ గల్లా జయదేవ్ హాజరయ్యారు. ప్రపంచం ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న తరుణంలో ఆర్థికాభివృద్ధిలో భారతదేశం వెలిగిపోతుంది. ఎన్నో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, వివిధ వర్గాలకు, చెందిన అగ్రగామి భారతీయ ప్రముఖులు తమ అభిప్రాయాలు పంచుకోవడానికి సమావేశమయ్యారు. సస్టెయిన్ బిలిటీ ఎనర్జీ, మొబిలిటీకి మార్గదర్శిగా వెలుగొందుతున్న అమరరాజా గ్రూప్ కో ఫౌండర్, ఛైర్మన్ జయదేవ్ గల్లా హాజరయ్యారు. ఆయన వ్యాపారం కోసమే కాక కోవిడ్ మహమ్మారి అనంతర పరిణామాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సమావేశంలో వివరించారు. అజర్‌బైజన్ ఆర్థిక మంత్రి, యూఎస్ఏలోని ఇల్లినాయిస్ రాష్ట్ర గవర్నర్‌ను ఈ సందర్భంగా కలిశారు. భారతి ఎంటర్‌ప్రైజస్ సీఈవోసునీల్ భారతి మిట్టల్, మహీంద్రా అండ్ మహీంద్రా(ఆటో, ఫార్మ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జుజిరికర్, భారత్ ఫోర్జ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ కల్యాణి, అపోలో టైర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ కన్వార్ వంటి పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన మాట్లాడారు. పరిశ్రమ సెంటిమెంట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించిన జయదేవ్, భారతదేశపు వృద్ధి పట్ల తన ఆశావాదాన్ని వెల్లడించారు. అంతర్జాతీయంగా సుప్రసిద్ధమైన వోల్వో, సీమెన్స్, స్నీడర్, సోని, హిటా, పెట్రోనాస్ తదితర సంస్థల గ్లోబల్ హెడ్స్‌ను కడా కలిశారు. విద్యుత్ వాహనం కోసం లిథియం అయాన్ బ్యాటరీలను తయారు చేయడం కోసం ఆ దిశగా ఫ్యాక్టరీని అమరరాజా గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రూప్ 16 వేల మందికిపైగా ప్రజలకు ఉద్యోగాలను ప్రత్యక్షంగా అందించడంతో పాటుగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 10 తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## కన్నికాపురంలో జల్లికట్టు సంబరాలు

### పోటెత్తిన జనసంతోహం ఉరకలెత్తిన ఉత్సాహం



వెదురుకుప్పం, జనవరి 22 ప్రభాతవార్త:
కన్నికాపురంలో జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటాయి. మండల పరిధిలోని గంటావారిపల్లి పంచాయతీ, కన్నికాపురంలో ఆదివారం సంక్రాంతి సంబరాలలో భాగంగా పశవుల పండుగను గ్రామీణ యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాడి రైతులు ఎద్దులకు కట్టిన పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన జనసందోహం పౌరుషంతో పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో పాడిరైతు తన ఎద్దు కొమ్ములకు ఒక చెక్కతో అందంగా మలచబడిన పట్టీని కట్టి జనంలోకి వదలిపెట్టాడు. జల్లికట్టు సంబరాలలో తమ పౌరుషాన్ని ధీటుగా ప్రదర్శించేందుకు యువత సైతం రెట్టించిన ఉత్సాహంతో పోటెత్తిన పోట్లగిత్త_లను నిలువరించి పట్టీని సొంతం చేసుకునేందుకే బరితెగించి యుద్ధమే చేశారు.

## భక్తులతో పోటెత్తిన కాణిపాకం ఆలయం



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడిన దృశ్యం